# నిజం చెప్పినా నమ్మరు

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

సుమంగళి లలాటంలో మెరిసే కుంకుమ తిలకంలా అరుణారుణమయిన సాంధ్య శ్రీ పశ్చిమభాగంలో సూర్యుడు గృహోన్ముఖుడౌతున్నాడు. భానుడికి వీడ్కోలిచ్చి తన పరిపాలన సాగించడానికి త్రిరాత్రులు తక్కువైన రేరాజు నిండు కళలతో పైకివస్తున్నాడు. ప్రకృతి ఎంతో రమణీయకంగా వుంది. పక్షులుకూడా కిలకిలానవ్వుతున్నాయి. కాని ఆనందకరమైన ప్రశాంత సమయంలోనూ కూడా సీత ముఖంలో చిరునవ్వుకూడా కరువైంది. మధ్యాహ్నం ఇంటిల్లపాదీ తననిమాత్రం ఇంట్లో వదలి సినిమాలకి వెళ్ళారు. మధ్యాహ్నం మ్యాటనీ, సాయంత్రం ఫస్టుషో, సెకండుషో చూచివస్తాం! ఇల్లు జాగ్రత్తగా చూస్తూండమని చెప్పి వెళ్ళిపోయారు. ఈనాడెందుకో తనకీ సినిమా చూడాలనివుంది. ఆమాటే చెప్పింది తనూ వాళ్ళతో వస్తానని - కాని వారంతా తననో గొంగళీ పురుగులాచూచి ఇంట్లో వదిలేసి వెళ్ళిపోయారు. తన మనస్సు ఈనాడు వెయ్యి వ్రక్కలై పోతోంది. తను ఓ అభాగ్యురాలు - తన బ్రతుకు నిరర్ధకం - అంతే ఇంక! గోడనున్నా కేలండరు చూచింది. ఈనాడు ఏప్రిల్ పదకొండో తారీకు - రేపటితో తనకు మూడు దశలు నిండుతాయి. రేపు తను 'పుట్టినరోజు.' అన్నమాట గుర్తుకువచ్చేసరికి బెబ్బులిని చూచిన లేడిలా తృళ్ళిపడింది. తన పుట్టిల్లుకదా అని గంపెడాశతో వస్తే- అందరికంటే మించిపోయాడు తన తండ్రి - తన బ్రతుకులో మంచి చెడ్డలు తెల్సుకొని జీవితం అంటే ఏమిటో అర్ధం చేసుకొనేసరికి పదహారు వసంతాలు గడిచిపోయాయి. తన చెల్లి లీలకు అప్పటికి పన్నెండో సంవత్సరం - ఆమె వివాహానికి తన అత్తవారంతా రావడం; తనని తమతోకూడా తీసుకువెళ్లడంతో తన బ్రతుకంతా అర్ధం చేసుకుంది. తనని అత్తవారింటికి పంపిస్తూ 'నీకు పదేళ్లయినా రాకుండానే పసుపు కుంకానికి కరువైంది తల్లీ! అది నీ నుదటివ్రాత. అత్తవారింట్లో పడుండడమే ఆడదానికి గౌరవం వెళ్లిరా!' అని తండ్రి 'నిన్ను కన్నానేకాని నీ నుదుటి వ్రాతను కన్నానా అమ్మా! కష్టమైనా నిష్ఠూరమైనా వాళ్లింట్లోనే వుండమ్మా!' అంటూ తల్లి తనని అత్తింటికి సాగనంపారు. ఒకదశ - నిండాపదిసంవత్సరాలు అత్తవారింట్లో శవజాగరణ చేసినట్లుగా గడిపింది - నాలుగేళ్ళక్రిందట పుట్టింట చేరింది తను. ఈనాడు తన ముప్పైఏళ్ల జీవితంలోనూ జరిగిన సంఘటనలను నెమరుకు తెచ్చుకొంటూ కూర్చుంది.

తను అత్తవారింట్లో జేరిన క్షణంనుంచీ అత్తగారు మాత్రం తల్లిలా ఆదరించేది. అలంకారాలకి, పసుపు కుంకుమకి దూరంగావున్నా ఆదరాభిమానాలకి మాత్రం అత్తగారు ఏనాడు తనకు లోటుచెయ్యలేదు. తను ఒంటరిగా పడుకొని బాధపడుతుందని తోడుగా అత్తగారు తనదగ్గరే పడుకొని ఆవిడ చిన్ననాటి కబుర్లన్నీ చెప్తూండేది.

ఓరోజు - తన మరిదివచ్చి ఓ నవల తెచ్చిఇచ్చాడు చదువుకోమని. తను తన మరిది సమాన వయస్సువారు అవడంచేత, అతనికి స్కూల్ ఫైనల్ పరీక్షలు పూర్తయి ఖాళీగా ఇంట్లో వుండడంచేత, తర్చు తనతో మాట్లాడుతూ, ఏదో బాతాఖానీ వేస్తూండేవాడు. సరిగ్గా ఆ రోజు నవల సగం చదువుతూండగానే ఇచ్చెయ్యమని వచ్చి చేతిలో పుస్తకం లాగేసుకోబోతోంటే, తను ఇవ్వనని ఆపుస్తకం గట్టిగా పట్టుకొంది. సరిగ్గా అదే సమయంలో అత్తగారువచ్చి 'ఏమిట్రా రమణా! నువ్వు మరీ చిన్నపిల్లాడివై పోతున్నావు. ఏళ్లు వస్తోన్నకొద్దీ బుద్ధి తగ్గుతోందేమిటి?' అంటూ ఖస్సుమనేసరికి అతను చల్లగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

'సీతా! ఆ రవణిగాడికి నిండా పదహారేళ్ళు లేకపోయినా, పాతికేళ్ల పడుచువాళ్ళకుండే గుణాలన్నీ లోటులేకుండా వున్నాయి. వాడికి నువ్వు కాస్తదూరంగా వుండడం మంచిది. తర్వాత ఏమాత్రైనా మీదపడితే భరించడం కష్టం' అంటూ గట్టిగా చెప్పేసి వొడ్లోకి వెళ్ళిపోయింది ఆవిడ.

ఆవిడయందుండే చనువు, స్వతంత్రతాచేత ఆమాటను కూడా ఎక్కువ విలువతో తీసుకోలేదు తను. ఆ సాయంత్రం రమణ యింటికివస్తూ ఎన్నో బుక్సు తెచ్చి తనకు చూపించకుండా తిన్నగా గదిలోకి తీసుకుపోయాడు. చాటుగా నిల్చుని తనుమాత్రం అన్నీ చూచింది.

రాత్రి తను రమణగదిలోకి వెళ్ళి బుక్సుతీసి హెడ్డింగులు చదివి మళ్ళీ యథాస్థానంలో పెడ్తోంది తను, ఇంకెవరూ లేరుకదా అనే ధీమాతో - వదినగారియొక్క ఆసక్తిని, బుక్సుచదవాలనే కుతూహలాన్ని దూరంనుంచే చూచి సహృదయంతో ఆనందిస్తున్నాడు రమణ. ఒక గంట ఒక్కనిమిషంలాగ అయిపోయింది తనకి, ఆపుస్తకాలు చూచి మళ్లీసర్ది యథాస్థానంలో పెట్టడానికి - అంతలో అత్తగారువచ్చి 'సీతా! నీవరస ఏమీ బాగుండలేదు...ఆ నేను ఈ యింట్లో వున్నంతకాలం, ఈ కొంపలో అన్యాయాలు, అక్రమాలు జరగడానిని వీల్లేదు. నేను బ్రతికుండగా ఎవరి ఆటలు సాగవు - మీ రిద్దరూ గంటనుంచి ఈ గదిలోవుడడం చూస్తున్నా - ఎవరైనాసరే ఈ కొంపలో వెధవపని చెయ్యాలనీ, నీచపు మార్గాన్ని త్రొక్కాలంటే అల్లాంటిది ఈ గుమ్మంలోంచి నా శవం బయటకు వెళ్ళాకగాని జరగదని గుర్తుంచుకో' అంటూ మహా రౌద్రమూర్తియై గర్జించి చెప్పారు అత్తగారు.

'అదేమిటమ్మా! అల్లా అపార్థం చేసుకు మాట్లాడ్తావ్? వదిన...'

'చాల్లేరా! నోర్ముయ్!! నువ్వు నాకేమీ చెప్పక్కర్లేదు!!! బ్రతికివున్న నా కళ్లు మీ రెవ్వరూ ముయ్యలేరు.' అంటూ గ్రుడ్లురిమి చెప్పేసరికి గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు రమణ అక్కడనుంచి.



రమణ వెళ్లిపోయాక ఇంట్లో అంతరూ తనమీద కొరకొరలాడ్తూ నమిలిమ్రింగేశేలా చూచారు. రాత్రి అన్నం తినేటప్పుడు తను ఏడ్చి ఏమీఎరుగనని చెప్పి-ఆవిడ అన్న మాటలకి మనస్సులోనే నొచ్చుకొని ఎంతో ఓదార్చింది తనని. అత్తగారి ఆదరపూర్వకమైన మాటలతో మళ్లీ తనకి కొంత మనశ్శాంతిఅయి హాయిగా నిద్రపోయింది రాత్రి.

అత్తగారికి తెల్లవారుఝామునే లేచి ఇంట్లో ప్రాచిపన్లు చేసుకొనే అలవాటు. ఆరోజు ప్రొద్దున్నే లేచి నిత్యకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లిన ఆవిడ గంటప్రొద్దెక్కినా ఇంట్లోకి రాకపోయేసరికి, ఇంటిల్లపాదీ ఖంగారుపడ్డారు. మధ్యాహ్నంవరకూ ఆవిడకోసం ఎదురుచూస్తూ అందరి ఇళ్లూ గాలించి చూచారు. ఫలితం శూన్యమైంది.

'ఏం వదినా? మా అమ్మ ఎక్కడకు వెడ్తూన్నదీ నీతోనైనా చెప్పలేదా?' అంటూ రమణ ఎంతో బాధగా అడిగాడు.

'నాకేం తెలీదోయ్! రాత్రిమాత్రం మీ అమ్మగారు ఒంట్లో ఏమీ ఆరోగ్యం బాగుండడంలేదనీ, మళ్లీ ఫిట్సు వస్తాయేమోననికూడా భయంగావుందని చెప్పారంతే. రాత్రి మూడుగంటలకి ఆవిడా నేనూ లేచాం, ఇంక నాకేమీ తెలీదు.'

ఆమాట తన నోటంట వచ్చేసరికి మామగారు, ఇరుగు పొరుగువారు అంతాకల్సి నూతులు, గోతులు, చెరువులు వెదకడం ప్రారంభించారు-రమణ ఆత్రాత్తుగా లేచి 'నాన్నా! మన నూతిలో చూద్దాం!' అన్నాడు.

అందరూ వచ్చి ఆ నూతిలోనుంచి ఆవిడ శవాన్ని బయటకు తీశారు. అందరూకూడా తననే నిందించారు. 'మరిదిమీది మక్కువచేత అత్తగారిని...'

చివరకి రమణకూడా తననే అపార్థంచేసుకున్నాడు. ఆఖరికి మనస్సులో వుండబట్టలేక 'వదినా! నామీద దురభిప్రాయంతో అమ్మప్రాణాల్నే తియ్యడానికి సంసిద్ధురాలవౌతావనుకోలేదు. నిన్ను నా సోదరిలా చూసుకొంటున్నా' అని కళ్లంట నీళ్లతో చెప్తోంటే... న్యాయాన్యాయ విమర్శలేకుండానే తనకి హం...త...కి...అనే బిరుదు ఇచ్చిందీలోకం. నెలదాటకుండానే రమణ చదువుకోసం పట్నం వెళ్లిపోయాడు.

నాల్గు సంవత్సరాలు గడిచాయి తనకు వంటయింట్లో. రమణ బి. ఎ. డిగ్రీ పుచ్చుకు ఇంటికి వచ్చాడు. రమణ మీద తనకి ఎప్పుడూ ఎటువంటి అభిప్రాయంకూడాలేదు. ఆ యింట్లో అందరికంటే చనువుగా మాట్లాడ్తాడని మాత్రం కొంచెం అభిమానంగా చూచేది తను.

రమణను పెండ్లికొడుకుని చేస్తున్నారు. ఇంట్లో అందరికీ బట్టలు తీయించుకొచ్చారు మామగారు. తనని క్రొత్త బట్టలు కట్టుకోమని మాటమాత్రంగాకూడా ఎవ్వరూ అనలేదు. తను వంటింట్లోనుంచి బయటకు రానూలేదు.

పెళ్లి చేసుకొని పెళ్లికూతురుతోసహా గృహప్రవేశానికి వచ్చారు. ఇంటినిండా బంధువులు, కొడుకు కోడలు, ఆనందమయమైన జంటలను, దంపతులుగా తనముందు వారినందర్నీ చూచేసరికి తన మామగారికికూడా మనస్సులో కోరికలు ఊరాయి. మర్నాడు సాయంత్రం పెళ్లివారంతా తమ పొలాలు చూడ్డానికి వెళ్లారు. తను అన్నిపన్లూ పూర్తిచేసుకు దొడ్లో తులసికోటదగ్గర ఒంటరిగా చీకటిని చూస్తూ కూర్చుంది.

'సీతా! ఒక్కర్తివూ ఇక్కడ కూర్చున్నావేం? ఈ పెళ్లిపన్లతో నీకు చాలాశ్రమ అయిపోయింది. నిన్ను గురించి కొంచెమైనా కనుక్కొని అడుగుదామంటే కూడా నాకు సావకాశం కుదరడంలేదు', అంటూ అభిమానం ఉట్టిపడేలా పల్కరించారు మామగారు.

అంతవరకూ ఏనాడూ తనతో మాట్లాడని ఆయన అల్లా పల్కరించేసరికి ఆశ్చర్యపోయి చకితురాలైపోయింది తను.

'సీతా! మీ అత్తగారు బ్రతికుండగా ఆమె ఏనాడూ సుఖించలేదు. ఆమె ఈ యింటికి కుటుంబాన్ని వృద్ధి చెయ్యడానికే వచ్చింది. పదిమంది సంతానాన్ని కన్నదే కాని; వాళ్ల ముద్దుముచ్చట్లు ఏమీ చూడకుండానే భారమంతా నీకు ఒప్పగించి వెళ్లిపోయింది. ఈ చీమలబారులాంటి సంతానాన్ని ఏలోటూ రాకుండా తల్లిలా చూస్తున్నావు...నువ్వు మాపిల్లలకి తల్లివంటిదానవే...' అంతవరకూ అనేసి ఆగిపోయారు తన మామగారు.

ఆమాటల్లోని గూఢార్థాన్ని తరిచి తెల్సుకొనేటంత జ్ఞానం తనలో లేదు. కంచుగంటలాంటి తన మామగారి కంఠస్వరం ఎంతో ఆప్యాయతగా విన్పించేసరికి మురిసి

పోయింది తను—తనకి మామగారితో మాట్లాడ్డానికే భయం. ఏదైనా అత్యవసర సమయాల్లో పిల్లల చేత నే ఏమాటైనా చెప్పించేదికాని తను ముఖాముఖీని ఏనాడూ జవాబివ్వలేదు.

'సీతా! ఇకముందునుంచి నువ్వుకూడా కొంచెం సరదాగా వుంటూండు. నేనూ మానవుడనే. నన్ను చూచి నువ్వెందుకంత హడిలిపోతావ్? ఇంక మళ్లీవారంలో రమణ భార్యతోసహా ఉద్యోగానికి వెళ్లిపోతాడు. మగపిల్లలిద్దర్నీకూడా వాళ్లతో పంపించెయ్యాలనుకొంటున్నా. ఇంక చిన్నవాళ్లు ఆరుగురు పిల్లలు మనమూను ఇంట్లో వుంటాం—నీకు కొంచెం విశ్రాంతి వుంటుందనుకొంటూ...' అంటూ ఎంతో హుషారుగా చెప్తున్నారాయన.

తను ఈనాటివరకూ మామగారు శాంతంగా మాట్లాడ్తారని అనుకోలేదు ఎన్నడూ.

'ఇల్లా ఇంట్లోకిరా! నువ్వుకూడా శుభ్రమైన చీరకట్టుకొని, కాస్త నలుగురితోబాటు నవ్వుతూ వుండు.'

తనింతవరకూ మామగారు కఠినుడనిమాత్రమే అనుకొనేదికాని ఆయనలోకూడా నవనీతహృదయం వుందని ఏనాడూ భావించకపోవడంచేత ఎంతో ఆశ్చర్యపోతూ నిల్చుంది.

'ఇదుగో చీరా జాకట్టు. ఇవి నువ్వుతీసుకో-కుటుంబంలో మంచిచెడ్డలు, కష్టసుఖాలు తెల్సుకోవల్సిన బాధ్యత నీకూ వుంది. వంటయింట్లోనేకాకుండా అన్ని విషయాల్లోనూ నీవుకూడా నాతో సమానంగా భారాన్ని వప్పగిస్తున్నా', అంటూ చీర చేతికి ఇవ్వబోయాడు.

ఒక్కసారిగా తన మనస్సులో ఎన్నో ఆలోచనలు వచ్చాయి. కాని పెద్దవారైన మామగారి హృదయాన్ని శంకించటానికిమాత్రం సాహసించలేకపోయింది తను. ఆయన తెచ్చిన చీరను స్వయంగా తనచేతికి అందిస్తూంటే... ఇంకేమీ నోటితో జవాబివ్వలేక మౌనంగా అందుకుని ఇంట్లోకి వెళ్లిపోయింది.

♦ ♦ ♦

నెలరోజులకల్లా ఎక్కడివారక్కడికి సర్దుకొన్నారు. ఇంక ఇంట్లో మిగిలినవాళ్లు పదిహేనేళ్ల అమ్మాయి, పదమూడు సంవత్సరాల అమ్మాయి, మిగతా నల్గురూ వాళ్ల తరువాయి పిల్లలు. తను ఆయింట్లోకి వచ్చేసరికి ఆఖరి మరిది చంటిపిల్లాడు. ఈనాడు ఆ పసివాడుకూడా పలక తీసుకు స్కూలుకి వెడ్తున్నాడు. తను వచ్చేసరికి


# తరచుగా మూత్ర విసర్జన

తరచుగా మూత్రం విసర్జించడం ప్రమాదకరమైన చిహ్నం. అది శరీర తత్వాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, రోజు రోజుకూ రోగిని మృత్యు సమీపానికి తీసుకవస్తుంటుంది. ఆరంభంలో శారీరకంగా కానీ, మానసికంగా కానీ శ్రమపడడానికి అయిష్టత, నడుం నొప్పి, దృష్టి మాంద్యం, తొడలవద్ద తిమ్మిరి, సర్వసాధారణంగా బలహీనత మొదలైన లక్షణాలు కనబడుతూ వుంటవి. ఈ లక్షణాలు గోచరించడంతోనే తగిన చికిత్స చెయ్యకపోతే, వుత్తరోత్తరా అమిత దాహం, ఆకలి, నోరు, గొంతు ఎండుకపోవుట, దురద, కాళ్లలో సంకవాపు బరువు తగ్గడం, శరీరమంతాపోట్లు, కీళ్లండం, కళ్లపొర, టి. బి., కురుపులు రాచుతటం, తదితర తీవ్రవ్యాధులకు గురి కావలసి వస్తుంది. "వీనస్ చారం" బిళ్లలు వాడి వేలాది మంది శమనం పొంది మృత్యువాత పడకుండా తప్పించుకొన్నారు. "వీనస్ చారం బిళ్లలు ప్రాచీన యునాని వైద్య సిద్ధాంతం ప్రకారం శాస్త్రీయంగా, అరుదైన మూలికలను, తోవనస్పతుల సారములతోను, స్వాభావికమైన క్షారములతోను తయారుచేయబడ్డవి. ఈ చికిత్స మొదలుపెట్టిన రెండవ లేదా మూడవ రోజునుంచే అమిత దాహం తగ్గి తరచుగా మూత్ర విసర్జన చేయడం నిలిచిపోతుంది. కొద్దిరోజులలోనే మీకు సగానికి పైగా స్వస్థత చేకూరినట్టనిపించును. "వీనస్ చారం" ఖర్చు తక్కువ. నిరపాయమైనది. తీసుకొనడం సులభం. ప్రత్యేక కఠిన పద్యాలు కానీ, వుపవాసాలు చేయవలసిన అవసరం కానీ వుండవు. రోగులు పుష్టికోసం బలప్రవర్తకమైన వివిధ పదార్థములను భుజింపవచ్చును. కోరిన వారికి పూర్తి వివరాలు కల సారస్వతం ఇంగ్లీషులో పంపబడును. 50 బిళ్లల ఖరీదు రు. 6.75 న.పై. మాత్రమే. ప్యాకింగు, పోస్టేజి వుచితం. దొరుకుచోటు

వీనస్ రీసర్చి లేబరేటరి (K. T.)

పో. బా. నం. 587, కలకత్తా.

బక్కపలుచగా పేలగా వుండే పెద్దమ్మాయి ఈ నాడు మంచి పుష్టిగా; సహజ సౌందర్యానికి వచ్చేవయస్సుతో శోభగా కన్పిస్తోంది. చిలిపిమాటలతో వదినా! వదినా! అంటూ తనని వేళాకోళాలుకూడా చేస్తోంది. అందుకు తనుకూడా 'నీకోసం వెతుక్కుంటూ వచ్చే మా తమ్ముడు ఇంకా తెరచాటునుంచి ఎప్పుడు బయల్పడతాడో?!' అంటూ నవ్వుతూ అంటూండేది.

చల్లగా రెండు నెలలు దొర్లాయి.

ఒకరోజు రాత్రి తనూ ఆ బిడ్డ లిద్దరూ కల్సి దొడ్లో వెన్నెట్లో చాపవేసుకు నవ్వుతూ కబుర్లు చెప్పుకొంటూంటే మామగారుకూడా అక్కడికొచ్చారు. మేలిముసుగులోని అప్సరస ముఖంలా పల్చని మబ్బుల్లోంచి చంద్రుడు చల్లగా ప్రయాణం సాగిస్తున్నాడు గగనంలో - తనని ఎల్లాగైనా పల్కరించి మాట్లాడాలని మామగారు విశ్వప్రయత్నాలు చేసారు. కాని ఆయన ప్రయత్నం వ్యర్థమైపోయింది.

తననుండి ఎన్నాళ్లయినా మాటకి జవాబు వచ్చే సూచనలు కన్పించక పోయేసరికి! ఆయన కూతుళ్ళ ద్వారా తనని ముస్తాబు కమ్మని ఆజ్ఞాపిస్తూండేవారు. ఆయన చెప్పినట్లు తను వినక - ఆచరించక పోయిన నాడు ఆయన పస్తువుంటూ అభోజనం పడుండేవాడు.

మామగారి అధికారపూర్వకమైన ఆజ్ఞవల్ల నయితేనేమి; వారి అమ్మాయిల వేడికోలువల్ల నయితేనేమి; తను బాహ్యంగా మారక తప్పలేదు. ముఖానికి స్నో, పౌడరుతో మెరుగులు దిద్దుకోవల్సివచ్చింది. ముతుక నూలు చీరలకు బదులు సన్నని వాయిల్సు కట్టుకొనేది. వేలుముడి వేసుకొనే స్థానంలో వాలుజడ అమరింది— మామగారి అభిమతంగా తనెంత మారినా తనమనస్సులో మాత్రం ఎల్లాంటి మార్పురాలేదు. మామగారిమీద ఒక విధమైన గౌరవంమాత్రంవుంది తనకు. అయినా ఏనాడూ తను ఆయనతో స్వయంగా మాట్లాడలేదు. అందుకు మండలిస్తూన్నట్లుగా మామగారి మాటలద్వారా తనకు అర్థమవుతూనే వుండేది,

పండగ శెలవుల్లో రమణ, భార్య మిగతా ఇద్దరు మరుదులు వచ్చారు. తనలోని మార్పుకి అందరూ చాలా ఆశ్చర్యపోయారు. తన తోడికోడలు ఇంక వుండబట్టలేక చివరకు అడిగేసింది కూడా—

కపటం, కల్మషం ఎరుగని తను యదార్థానిని చెప్పింది. నిజాన్ని చెప్పినా నమ్మే సహృదయులు లేరు. తను తెల్సుకోలేక పోయింది.

రాత్రి భోజనానికి వస్తూ 'వదిన ఇంతపోకు ఎవరికోసమౌతోందో?' అని పెద్దమరిది అన్నాడు.

'అందుబాటులోవున్న పుష్ప మాధుర్యాన్ని అనుభవించకుండా వదిలే మూర్ఖుడెవడుంటాడు? ఇరుగుపొరుగు జల్సారాయుళ్లు చాలా ఫ్రీగా లభిస్తారులే - ఎవరినో ఏమిటి? మన ప్రక్కింటి సోమరాజుని కీప్ చేసిందని నాకు అప్పుడే చెప్పేశారులే' అన్నాడు చిన్నమరిది.

'పైకి ఏమీ ఎరుగని నంగనాచిలా వుంటుంది. ఒక్కసారి చూచేసరికే మనకింత బాధగావుంటే... పాపం! నాన్నమనస్సులో ఎంత నొచ్చుకొంటున్నారో ఈ విపరీత ప్రవర్తనకి... పైగా తన తప్పుని కప్పిపుచ్చుకోడానికి అదంతా నాన్నగారే చేసుకోమన్నారని ఎంత ధైర్యంగా చెబుతోందో?' అని మూడో మరిదిఅన్నాడు


'ఎంతటి బొంకులూ నేర్వకపోతే ఇంత...' అంటూ ఇంకొంచెం అందించింది రమణ భార్య.

ఈ మాటలన్నీ తన చెవులకి విన్పించి ఆ రాత్రి ఎంత కన్నీరు ఒలక బోసుకుందో ఆదైవానికి మాత్రం తెలుసు, అందుకే నోరుమూసుకు మెదలకుండా సహించి ఊరుకుంది. ఆఖరి మరిదికూడా పెరిగి పెద్దవాడై తన తిండి తాను తినగల్గి హాయిగా వంటరిగా వుండగల్గేస్థితి వచ్చే వరకూ తను ఎన్నిఅవమానాలైనా సహించుకు పడివుండాలనే మనస్సా నిశ్చయించుకొంది.

♦ ♦ ♦

ఓ నాటిరాత్రి—అర్ధరాత్రి సమయంలో రెండు బలమైన ఇనుపహస్తాలు తనని గాఢంగా హత్తుకోవడంతో గభీమని మెలకువ వచ్చింది—త్రుళ్లిపడి కళ్లువిప్పి చూచేసరికి ఆ దీపం ఆరిపోయి అంతా కటిక చీకటిగావుంది. కెవ్వున అరవబోయింది తను గట్టిగా నోటికి అడ్డుగా నొక్కివేయ బడింది ఆ దృఢహస్తం.

'సీతా! నీకోసం అహోరాత్రాదులు అలమటిస్తున్నానా బాధనుగ్రహించి నువ్వే అంగీకారంతో మాట్లాడ్తావనుకొన్నాను... కాని చివరకు నేనే స్వతంత్రించ వల్సి వచ్చింది...' అన్నారు మామగారు.




'నేను మీ కోడల్ని - మీరు నాకు తండ్రివంటివారు. నేను అనాథనైనా ఇల్లాంటి నీచపు కృత్యానికి మాత్రం...'

'సీతా! ఈ శ్రీరంగనీతులు కట్టిపెట్టు. నిన్నుగురించి అనేకవిధాలుగా ఎందరో ఎన్నో చెప్పుకోవడం చెవులారా విన్నాను. నన్నుమాత్రం ఎందుకు కాదంటావ్? నీ దగ్గరకి వచ్చిపోయేవాళ్ళల్లో నన్న ఓకనిగా చేర్చుకో.'

ఆయన చివరిమాట తనని బల్లెంతో పొడిచినట్లయింది. 'ఆ వచ్చేవారంతా నాకోసంకాదు; నీ కూతురు స్నేహాని కాంక్షించి వస్తున్నారు' అని నిజం చెప్పేద్దామనుకొంది తను, కాని ఆమాటను ఆయన ఈ స్థితిలో నమ్మడని తన అంతరాత్మ ఘోషించింది. లేచి నిల్చుని గట్టిగా అరిచింది. ఆకేకతో పిల్లలులేచి 'ఏమిటివదినా!' అనడిగారు.

'ఏమీ లేదమ్మా! వదిన ఎందుకో రమ్మనిపిలిస్తే ఇల్లా వచ్చానంతే...భయం లేదులే సీతా!' అంటూ దీపం వెలిగిస్తూ కూతురికి జవాబిచ్చాడు ఆయన.

ఆ మాటతో తన ముఖం నల్లగా మాడిపోయింది. నిశ్చేష్టురాలయి అల్లాగే నిల్చుండి పోయింది తను.

'నాన్నను పిలవాల్సిన పనేముంది వదినా? మమ్మల్ని పిలిస్తే...'

'ఎవర్ని పిలిస్తే పోయిందేమిటి? ఇంక నిద్రపో!...' అని తండ్రి కసురి చెప్పేసరికి మళ్లీ నోరెత్తలేదు ఆయన పెద్దకూతురు.

ఆ గదిలోనుంచి ఆయన బయటకు వెళ్ళిపోగానే

**LOTUS BRAND**

**MICO**

దక్షిణ ఇండియాలో మొట్టమొదటిది

డి. డి. టి. మైకోసెన్ (BHC)

●

మైకోసెక్ (LINDANE) టాక్సెఫెన్, ఆల్డ్రిన్, క్లోర్డేన్, ఎన్డ్రిన్ మొదలగు వాటితో తయారు కాబడిన క్రిమి కీటకాదులను నివారించుటకు మందులు.

సల్ఫరు, కాపరుతో తయారుచేసిన ఫంగస్సు రోగములను నివారించుటకు మందులు. శాస్త్రీయముగ చిత్తూరు జిల్లాలోని కుప్పంలోను, మద్రాసులోను మా ఫ్యాక్టరీలలో తయారుచేయబడి సప్లయి చేయుచున్నాము.

●

వివరాలకు వ్రాయండి :

మైసూర్ ఇన్సెక్టిసైడ్సు కంపెనీ

31-ఎ. నార్త్‌బీచ్ రోడ్ - మద్రాసు-1

తను ప్రక్క మీద పడిపోయింది, ఆనకట్టను త్రెంచుకొని ప్రవహించే ఉత్తుంగతరంగాల్లా, ఝరిణీ ప్రవాహంలా దుఃఖం పొర్లివస్తూంటే ఘొల్లుని ఏడ్చింది ఆ రాత్రంతా తను.

దిన కృత్యాలకై ప్రొద్దున్నే లేచి పెరట్లోకి వచ్చేసరికి అక్కడే పొంచివున్న మామగారు తనని బలాత్కరించబోయేసరికి తనమానసంరక్షణార్థం అక్కడున్న రోకలి చేత్తో పట్టుకు బెదిరించబోయింది. కాని ఆయన ఉండే ఆవేశంలో రోకలికి సూటిగా రాబోయేసరికి అది గురితప్పి ఆయన ముఖానికి తగిలింది. ఇనపకట్టు సరిగ్గా కళ్ళకి ముక్కుకి తగిలేసరికి కెవ్వున అరచి నేల మీద పడిపోయాడు. రోకలి చేత్తోపట్టుకు అల్లాగే నిల్చుండి పోయింది తను.

ఆయన కేకవిని ఇంట్లో వాళ్ళు లేచివచ్చారు. అరగంటలో ఇరుగుపొరుగువారంతా అక్కడికి చేరారు. ఎవరికితోచిన అభాండాలు వారు తన నెత్తిన వెయ్యడం ప్రారంభించారు.

సాయంత్రం ఐదుగంటలయ్యేసరికి ఇచ్చిన టెలిగ్రాం అందుకొని బిలబిల్లాడుతూ వచ్చారు రమణ, అతనిభార్య, రమణ తమ్ములిద్దరూను - ఆస్పత్రికి తీసుకువెళ్ళి తన మామగారిని డాక్టరుకి చూపించేసరికి రెండు కళ్ళూ పూర్తిగా చితికిపోయాయి. ఇంక ఈయన 'అంధుడుగా జీవించాల్సిందే' అని చెప్పారు.

ఒక్కసారిగా ఇంటిల్లపాదీ గొల్లుమన్నారు 'తన దుర్నడత అంతా కళ్ళారా చూస్తున్నాడనే ఉద్దేశంతో మామగారి కళ్లు రెండూ పొడిచింది. ఈ ప్రయత్నంలో రాత్రినుంచీ తగిన అవకాశం కోసం చూచి ప్రొద్దున్నే పూర్తిచేసింది ఈ సాహసురాలు' అని తననిగురించి లోకమంతా నిష్కర్షగా తీర్పుచెప్పారు. తనుమాత్రం జరిగిన నిజాన్ని చెప్పింది. కాని తన మాటలవల్ల తన నెత్తినే మరికొన్ని అపవాదులు వచ్చిపడ్డాయి.

♦ ♦ ♦

పంచవర్షాలు గడిచాయి మళ్ళీ—ఇంట్లో అమ్మాయిలిద్దరికీ ఎంతమంది వరుళ్ళని తీసుకువచ్చినా ఏదో ఒక వంక ఎంచి ఎన్ని సంబంధాలు తెచ్చినా తిరగ్గొట్టేస్తున్నారు వాళ్లిద్దరూ. తండ్రి ఎటూ కదలలేని అంధుడై

పోయాడని, తమ్ముళ్లిద్దరూ చదువుల్లో వున్నారనీ, రమణ ఉద్యోగంలో పెట్టి ఎల్లాగో వరుళ్ళని వెతకి తన చెల్లెళ్లని చూసుకురమ్మని పంపిస్తూండడం; వాళ్లువచ్చి చూసుకొని 'అమ్మాయిలు మాకు నచ్చారు' అని చెప్పడంతో; వారికి చదువుతక్కువనో; అందంలో లోపమనో; అభిప్రాయాలు కుదరలేదనో; ఏదో వంకతో 'ఈ పెళ్ళికొడుకులు' మాకు నచ్చలేదు - అవి చెప్తూండేవారు అమ్మాయి లిద్దరూ,

తనుమాత్రం ఆడబిడ్డలిద్దర్నీ మంచిగా ప్రవర్తించమని, అనేకవిధాల నీతులు బోధించేది. అందుకు కూడా ఎదురుతిరిగి వారిద్దరూ తనకే నిందలు పడేసేవారు.

వరాన్వేషణలో రమణ విసిగి వేసారిపోయి చివరసారిగా ఇద్దరు పెళ్ళికొడుకులను వెంటబెట్టుకొని తనే స్వయంగా వచ్చాడు. అన్నగారు ఇంటికి వచ్చేసరికి పెద్ద చెల్లెలు గదిలో కూర్చుని ప్రక్కింటి సోమరాజుతో కబుర్లుచెప్తూ కూర్చుంది.

ఈ సంబంధమైనా ఎల్లాగోలాగ స్థిరపడాలనే అభిప్రాయంతో తనువాళ్లు కూర్చున్నగదిలోకివచ్చి విషయం చెప్పి 'ఎల్లాగైనా ఆ వచ్చినవానికి ఒప్పుకో. త్వరగా పెళ్లిచేసుకో' మని ఎన్నోవిధాల మంచిగా బోధించింది.

వదినగారు, చెల్లెళ్లుకూడా ఎంతకీ బయటికి రాకపోయేసరికి విసుగెత్తి రమణకూడాహాల్లోనుంచి తిన్నగా గదిలోకి వచ్చాడు. గదిలో ముగ్గురినీ చూచి నిర్ఘాంత పోయాడు.

'నువ్విక్కడికి రావల్సిన అవసరమేమొచ్చింది సోమరాజూ!' అని తీక్షణంగా అడిగాడు రమణ.

'నీకు తెలియనిదేముంది రమణా! ముప్ఫయి ఏళ్లు వచ్చినా బ్రహ్మచర్యం మాత్రం వదలడంలేదు. విద్యా, ధనములేని నిర్భాగ్యుణ్నయినా కోరికలుమాత్రం చంపుకోలేనుకదా! ఏదో సీత నాకోసం...' అంటూ ఇంక చెప్పలేక ఆగిపోయాడు సోమరాజు.

'వదినా! నువ్వింత నీచంగా ప్రవర్తించే హీనురాలవౌతావని కలలోకూడా అనుకోలేదు. ఇల్లా చాటుమాటుగా తిరిగి అందరికళ్ళూ పొడిచి చంపకపోతే పబ్లిగ్గా పెళ్ళిచేసుకొని ఏడ్వరాదూ?' అన్నాడు అసహ్యించుకొంటూ రమణ.

'రమణా! నిర్దోషినైన నన్ను అర్థంచేసుకొనేశక్తి లోకంలో ఎవ్వరికీ ఇంక లేనేలేదా?' అంది తను ఎంతో భారంగా.

'వదినా! పిల్లిలా కళ్లుమూసుకొని పాడుపనిచేస్తూ లోకం ఎవ్వరికీ తెలియదనుకొంటున్నావు—కాని ప్రపంచకమంతా కోడై కూస్తోన్నా నమ్మనంతటి అవివేకణ్ణి

వ్యవసాయోపకరణాలు !
పారిశ్రామిక యంత్ర పరికరాలు !!
LCT
చెరకు రసంతీసే యంత్రాలు - ఇనప నాగళ్లు - జి. ఎమ్. ట్రాంప్లర్ - వెట్ లాండ్ పుడ్లర్ - నాగలి, బండ్ ఫార్మర్ - గుంటక - బెంచ్ వైస్ - ప్రెస్సింగ్ మెషిన్ - గీర్ వీల్స్.
పి. ఎస్. జి. - కిర్లోస్కర్ - సుగర్ కేన్ క్రషర్‌లకు తగిన స్పేర్‌పార్టులు.
మేముకొత్తగా కనిపెట్టినది.
మెట్రిక్ మైనర్ ప్లాట్‌ఫారం బ్యాలెన్స్‌లు
ప్రాంతీయ ప్రాతినిధ్యం వద్ద రా[illegible]రాలకు:—
**ELSEETEE INDUSTRIES**
**P. Box No. 28, Opposite Central Studios**
**TRICHY ROAD — COIMBATORE**

కాదు నేను. ప్రత్యక్షంగా కన్పిస్తోన్నదానికి ఇంక సాక్ష్యమేమి కావాలమ్మా!' అన్నాడు కళ్లల్లో నిప్పులు కురిపిస్తూ రమణ.

'నిజం చెప్పాలంటే నేనింతవరకూ ఎన్నడూ ఈ సోమరాజుతో మాట్లాడికూడా ఎరుగను. అతని ముఖమైనా నేనెన్నడూ పరికించి చూళ్లేదు' అంది తను తల వొంచుకుని.

'ఇన్నాళ్లనుంచీ ఎందరు ఎన్ని చెప్పినా నిన్ను మంచిగానే భావించుకొనేవాడిని నామనస్సులో. కాని నేటితో నీ నిజస్థితి కళ్లారా చూచాను—నటననుగూడా నటించినట్లుగా కన్పడనీయకుండా నటించడం; కల్లబొల్లి మాటలచేత ఒప్పించడం నీకు బాగా తెలుసు.' అన్నాడు రౌద్రంగా.

'రమణా! నిజం చెప్పినా నమ్మలేవా? నీ చెల్లెలు మిత్రుణ్ణి...'

'వదినా! చాలు నీ అభాండాలు. ఇంక నువ్వి ఇంట్లో వుండగా నా చెల్లెళ్లకు పెళ్లిళ్లు అవడం కలలో వార్త. తక్షణం నువ్విక్కడనుంచి వెళ్లిపోవాలి' అని అరిచాడు.

ఒక్కగంటలో తననిగురించి పదిమందీ విమర్శించి, చివరకు బండి తీసుకొచ్చి ఒక పాలేరుని తనకి సహాయంగా ఇచ్చి బండి ఎక్కించారు. తను వచ్చేరోజున అదే బండిలో అత్తగారితో కలిసివచ్చింది ఒకప్పుడు—దైవంమీద భారంవేసి నిర్మలహృదయంతో పిల్లల్ని ఆదరించి పెంచి పెద్దచేసింది ఈ పది సంవత్సరాలు. ఇంక నేటితో ఈఊరికీ తనకి ఋణం తీరిందని చివరిసారిగా కన్నీరు కార్చింది. బండి ఊరుదాటింది—తను కన్పించకపోయినా తనమీదపడిన మచ్చలుమాత్రం శాశ్వతంగా ఆ ఊరివారినోట్లో స్థిరంగా మిగిలిపోయాయి.

తల్లి లేకపోయినా తండ్రిఅయినా ఆదరిస్తాడనే ఆశతో పుట్టింట అడుగుపెట్టింది. ఈదశకాలంలోనూ తన పుట్టింట ఎన్నో మార్పులు వచ్చాయి. తన తల్లి ఈలోకంనుంచి తప్పుకొంది. తన అన్నగారికి భార్య వచ్చి ఇద్దరు బిడ్డలతో కాపురం చేస్తూంది. తన చెల్లెలు ముగ్గురు బిడ్డలతల్లి అయింది. తన తమ్ముడు ఓ చిన్న ఆఫీసులో గుమస్తాగా నెలకో యాభైరూపాయలు తెస్తున్నాడు. నేడో రేపో పెళ్లికావడానికి సిద్ధంగా వున్నాడు. ఇంట్లో చాకిరీ గడవక నానా అవస్థపడే సమయంలో ఆదుకొన్నా తనని చూచి భూషించకపోయినా; దూషించలేదని చెప్పుకోవడంకూడా తనో ఘనతగానే భావించుకొనేది. తన కష్టసుఖాలు, అత్తవారింట్లో గడిచినవి అన్నీ తన తండ్రితోమాత్రం చెప్పుకొని భోరున ఏడ్చింది.

రోజులు, వారాలు, నెలలు, ఓసంవత్సరకాలం దొర్లించింది. తను, తన చెల్లి లీల నాలుగో కాన్పుకు పురిటికి పుట్టింటికి వచ్చింది. భర్త వంటరిగా వుండలేడని, హోటలు భోజనం సరిపడదని పోరెట్టి తనతోకూడా తీసుకువచ్చింది నెలరోజులు శలవు పెట్టించి-వారం రోజులలో తన మరిదికి కావల్సిన విశ్రాంతి పూర్తయి, తోచకపోవడం ప్రారంభించింది. ఉబుసుపోని బాతాఖానీ రాయుళ్లతో స్నేహం ప్రారంభించి, క్రమంగా పేకాట వ్యసనానికి గురిఅయ్యాడు తన చెల్లెలి భర్త. ఎప్పటి వార్తలప్పుడు తన తమ్ముడు మోసుకువచ్చి లీలకు చెప్తూండేవాడు. ఆ మాటలతో భార్యాభర్తలమధ్య వారంరోజులు చిలిపి తగాయిదాలు ప్రారంభమై అవి చివికిచివికి గాలివానగా మారాయి—చివరికి భార్యాభర్తలిద్దరిలోనూ తగని క్రోధాలు వైషమ్యాలు ప్రారంభమై 'రాత్రిళ్లు ఇంట్లోంచి ఎక్కడికైనా కదిలితే నేను ప్రాణత్యాగం చేసుకొంటా' అని నిష్కర్షగా చెప్పింది తన చెల్లి భర్తతో—

రాత్రిళ్లు అందరూ కల్సి బాతాఖానీ కబుర్లు చెప్పుకొంటూంటే తనుకూడా కొంచెం మాట్లాడుతూండేది. లీల భర్త చదువుకొన్నవాడు, సంస్కారహృదయం గలవాడు అవడంచేత తనని గురించి ఎక్కువగా సానుభూతి కన్పరుస్తూండేవాడు. తనని గురించి ఆమె భర్త జాలిపడి మాట్లాడినప్పుడల్లా తన చెల్లెలు భర్తమీద అనుమానిస్తూ కొరకొరా చూస్తూండేది. తను అది గ్రహించి కూడా ఏమీ అనలేకపోయేది.

ఓరోజు రాత్రి లీల భర్త సినీమాకి వెడ్తానని చెప్పి ఇంట్లోంచి వెళ్లాడు. రెండాటలు పూర్తిఅయ్యే టైమ్ కూడా అయిపోయినా ఇంటికి రాకపోయేసరికి లీల మనస్సులో ఎన్నో ఆలోచనలు బయల్దేరాయి. ఆమె భర్తని గురించి—రాత్రి మూడుగంటలు అయ్యాక మెల్లిగావచ్చి తలుపుతట్టి పిల్చాడు అతడు. ఆపిలుపు తను వింది, నిండు

చూలాలైన చెల్లికి నిద్రాభంగం కల్గించడమెందుకనే సదుద్దేశంతో మెల్లిగా తనేలేచి వెళ్లి వీధితలుపు తీసింది. ఆతడు లోనికివచ్చి తలుపుగొళ్లెంవేసి 'వదినగారూ! మీ చెల్లి నిద్రపోయిందా? నన్నుగురించి హడావిడి చేసిందను కొంటా' అన్నాడు నెమ్మదిగా.

'మీరు ఇంతరాత్రివరకూ ఆ పేకాట వ్యసనంలోపడి టైమ్‌కూడా తెల్సుకోకపోవడం ఏమీ బాగుండలేదు. మీరు ఇల్లాచేస్తోంటే, మీ ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా, మా చెల్లికి మనశ్శాంతి దూరమైపోతోంది.'

'ఎప్పుడూ తీరుబడిలేకుండా పనితో ఉక్కిరిబిక్కి—



రయ్యే నాకు ఇల్లా వృథాగా ఇంట్లో కూర్చుంటే కాలం ఎల్లా గడుస్తుంది చెప్పండి?...ఒకసారి పేకాట మజా మరిగాక వదలడమంటే నా మనస్సుకి...'

'అల్లాగని హద్దుమీరి అతివ్యసనం ప్రారంభిస్తే దాని వల్లవచ్చే అనర్థకాలు ఎంత విపరీతదారుణ పరిస్థితికి లాక్కుపోతాయో మీకు నేను వేరుగా చెప్పక్కర్లేదనుకొంటూ...'

'అల్లాగయితే ఇంక నేను ఇక్కడినుంచి వెళ్ళిపోతే నాకు కాలక్షేపం కాకపోవడమనే సమస్య వుండదు. అప్పుడు నాలో ఎల్లాంటి దుర్వ్యసనాలకి తావుుండదు నా మనస్సులో - లీల మనస్సును నొప్పిస్తున్నందుకు నాలో నేను ఎంతో బాధపడ్తున్నా. అయినా సహవాసదోషం తప్పించుకోలేక పోతున్నా.' అన్నాడు కోర్టులో దోషిలా.

అంతలో రివ్వుమంటూ లీల అక్కడికొచ్చి 'అక్కా! అత్తారింట్లో అత్తగారిని హత్యచేసి, మామగారిగ్రుడ్లు చితకకొట్టి, మరిదిని ఇంట్లోంచి వెళ్ళగొట్టి పక్కింటి బ్రహ్మచారితో నీ ఇష్టాలాపాలు జరుపుకొంటూ... తెచ్చుకొన్న అప్రతిష్టలతో బుద్ధి తెచ్చుకొన్నావేమో అనుకొన్నానే! ఈ నాడు నా కాపురానికే ఎసరుపెడ్తావనుకోలేదు. నువ్వు నరరూప రాక్షసివి...ఇందుకే ఈయనగారు నీ మాటలు పట్టుకు ప్రాకులాడుతున్నారు. ఇన్నాళ్ళూ మీ గూడుపుఠాణీ కళ్ళతో చూల్లేకపోయినా ఇవ్వాళతో దొరికిపోయారు కన్నంలో దొంగలిద్దరూ...' అంటూ కోపావేశంతో గట్టిగా అరిచింది.

ఈ కేకలువిని ప్రక్కగదిలోనుంచి అన్న వదినలు, దొడ్డివైపు వసారాలోనుంచి తన తండ్రి, వీధిగదిలోనుంచి తమ్ముడు బిలబిల్లాడుతూ పరుగెత్తుకువచ్చారు. తీరా చూచేసరికి... 'ఏమిటి?' అన్నట్లు నిల్చున్నారు అందరూ.

'చూశావా నాన్నా! మేమువచ్చి ఇంకా నెలరోజులైనా కాలేదు. అప్పుడే ఇది మావారితో...అక్క ప్రక్కమీద లేకపోయేసరికి ఎక్కడికి వెళ్ళిందో నని కొంతసేపు ఎదురుచూచా. ఎంతకీ మంచందగ్గరికి రాకపోయేసరికి 'ఏం చేస్తోందో!' అని చూడ్డానికి వచ్చేసరికి వీళ్ళిద్దరూ మాట్లాడుకొంటున్నారు...'

ఈ రభసకి నివ్వెరపోతున్న అతడు 'ఏమిటి లీలా ఈ అపవాదులు? ఇన్నాళ్ళనుంచి నువ్వు నన్నుగురించి...'

'చాలుచాలు, ఇంకేమీ చెప్పక్కర్లేదు నాకు...ఈ కొరివి ఇక్కడ వుందని తెలిసీకూడా మిమ్మల్ని రమ్మనడం నాదే బుద్ధితక్కువ. మీరెంత మంచివారైనా మిమ్మల్ని లొంగదీసుకొనే సామర్థ్యం దానికి వుంది కాబట్టే...మీ రిద్దరూ ఇల్లా నాటకం...ఛీ దీని ముఖానికి, తోడు, నీడ, అన్న ఇంగితజ్ఞానంకూడా లేకపోయింది. చెల్లెలు కాపరాన్నే చెడగొట్టే తుచ్ఛరాలు...'

'లీలా! మాటలు జాగ్రత్తగా రానియ్యి? అమాయకులమీద అపనిందలువేస్తే ఆ పాప ఫలితాన్ని ఎప్పటికైనా దేవుడు నీకు అనుభవింపజేస్తాడు.' అన్నాడు క్రోధంతో.

'ఛీ! ఇల్లాంటి కటికి కసాయి పాడుముండ కూతురని చెప్పుకోవడంకూడా తలవొంపు. ఇది చచ్చిపోయినా కాని ఎన్నో కుటుంబాలు బాగుపడ్తాయి. ఛీ! ఇదివున్న చోట రౌరవాది మహానరకాలు సంప్రాప్తిస్తాయి. ఇల్లాంటి వెధవబ్రతుకు బ్రతక్కపోతే ఎందులోనైనా దిగి చావరాదూ?...' అంటూ తన కన్నతండ్రే నానా దుర్భాషలూ అన్నాడు.

ఆ రాత్రంతా తనని ఇంట్లో వాళ్ళందరూ అనరాని మాటలన్నారు. మొయ్యలేని అపనిందలు నెత్తిన వేశారు. మర్నాటినుంచీ ఊళ్ళో అమ్మలక్కలందరూ కల్సి తనని గురించి గుసగుసలు ప్రారంభించారు.

ఇవన్నీ విన్న లీలకు ఒక్కక్షణంకూడా ఆయింట్లో వుండడానికి మనస్కరించక భర్తతో పిల్లలతో బండెక్కింది. బండి కదులుతోంటే 'నాన్నా! ఇంక నీయింటికి కావల్సినంతమంది షోకేళా యువకులు గస్తీ తిరుగుతూంటారులే—ఇది బ్రతికుండగా నేను ఈ యింట్లో అడుగుపెట్టడం ఇంక కలలోవార్త—ఎల్లాగో ఓలాగ నేను పుటుడుపోసుకోలేక పోనులే...' అంటూ కళ్ళంట నిప్పులు కురిపిస్తూ వెళ్లిపోయింది లీల.

ఇంకో సంవత్సరం దాటాక తన తమ్ముడికి కూడా పెండ్లయి భార్య కాపురానికి వచ్చింది—ఆమె వచ్చాక తన బ్రతుకు మరీ హీనంగా తయారైంది. ఇంట్లో తనని చూచినంత నీచంగా, అసహ్యంతో లోకంలో ఏ వస్తువునికూడా చూడరేమో!

తనకోసం సానుభూతి చూపించేవాళ్లు గాని, జాలిపడే వాళ్ళుగాని లోకంలో ఎవరూ లేరని తెల్సు—తను జీవించినా; మరణించినాకూడా ఒకే ప్రయోజనమని తెల్సు- అయినా తనలో తండ్రియందుండే ప్రేమచేత, ఇంట్లో తండ్రి పరోక్షంలో కొడుకులు కోడళ్ళు అనుకొనే మాటలు తను స్వయంగా వినడంచేత; తను లేకపోతే తండ్రిని ఆయింట్లో వారందరూ బ్రతికుండగానే దహనంచేసే రకమని గుర్తించుకొని తండ్రి కోసమైనా తను బ్రతికుండాలనుకొంది.

చూస్తూండగా తను పుట్టింటికి వచ్చాక నాల్గు కేలండర్లు తిరిగాయి. ఈ నాలుగేళ్ళల్లోనూ నలభై ఏళ్ళ జీవితానుభవం పొందిందితను. తన బ్రతుకులో ఆనందానుభవం; సుఖానుభూతి; అంటే ఏమిటో ఏనాడూ ఎరుగదు. స్త్రీ పురుషులమధ్య గల సంబంధ బాంధవ్యాన్ని కూడా తనే నాడూ ఊహించుకూడా ఊహ్వాంగలేదు మనస్సులోనైనా—

ఆ రోజున తన మరదలు చంటిబిడ్డనెత్తుకు వచ్చింది. తనచెల్లెలు పిల్లలు అంతా వచ్చారు—ఇంచుమించు ఊరంతా చంటిపిల్లను చూడ్డానికివచ్చి 'అచ్చంగా మేనత్త సీతమ్మ పోలిక, ముమ్మూర్తులా ఏ భేదం లేకుండా ముద్రవేసినట్లుంది' అన్నారు అంతా.

'ఏదో ఆ వెధవ పోలికవస్తే వచ్చిందికాని; ఆగుణాలు రాకుండావుంటే చాలు.' అని ఫెడీలున అంది అందరితోనూ తన మరదలు.

తనుమాత్రం కిక్కురుమనకుండా ఊరుకొంది.

రాత్రి అందరూ భోజనాలు చేస్తోంటే చంటిపిల్ల కక్కటిల్లి ఏడుస్తోందని తను ఎత్తుకోబోయింది. 'ఏమమ్మాయ్! సీతమ్మా! నువ్వుమాత్రం మా పిల్లని ఏనాడూ ముట్టుకోకమ్మాయ్! త్రాచుపాములని తెలిశాక కొంచెం దూరంగా వుండడమే మంచిది' అంటూ అన్నందగ్గర నుంచి లేచివెళ్ళి ఉయ్యాల్లో పిల్లని ఎత్తుకొని వచ్చింది మరదలు.

'ఈవిడగారు ఇంకా బ్రతికి ఎవరిని ఉద్ధరించాలనో? ఎందులోనైనా దిగి చచ్చినా పీడ విరగడైపోను.' అని వదిన అంది.

వరసగా తనని అందరూ తలో ఒక్కొక్కమాట అన్నారు. అంతలో తండ్రివచ్చి ఓ తట్టవరసు తిట్లదండకం వల్లించాడు.

రాత్రంతా తను ఎంతో దీర్ఘంగా ఆలోచించింది తన ముప్ఫయిఏళ్ళ బ్రతుకులోనూ...తను ఎవరికీ పనికిరాని ఎందుకట్టె...తను ఎవరికోసం బ్రతకాలి?...తననిగురించి నిజం చెప్పాలంటే? నిర్దోషి...నిజంచెప్పినా నమ్మరు... ఆఖరిసారిగా తనకో కోరికవుంది. తనకి సినీమా చూడాలనివుంది. తనకి జ్ఞానంవచ్చాక ఈ నాటివరకూ ఎన్నడూ సినీమాఅంటే ఏమిటో; చెప్పుకోవడమే కాని చూచి ఎరుగదు. ఈ నాడు అందరూ సినీమాకి ప్రయాణమౌతూంటే తనూ వస్తానంది. అందరూ తనని అనరాని మాటలని వెళ్ళిపోయారు.

అర్ధరాత్రి దాటింది. ఇంక తననిగురించి ఆలోచించుకోలేక పోయింది. కన్నీటితో మెల్లిగా కదిలింది. ఊరి చివర గంగాభవాని తనని ఆహ్వానించింది. తన శవాన్ని కూడా వారికళ్ళకి కన్పడనీయడం తన కిష్టంలేకపోయింది. తను మొయ్యగలిగినంత పెద్దరాయిని ఓ త్రాడుతో పొట్టకు కట్టుకొంది. పొంగి పొరలే దుఃఖంవలె ఎగిరిపడే కెరటాలతో స్వాగతమిచ్చే గంగాభవానీ ఒడిలో శాశ్విత నివాసానికై దాగిపోయింది సీతమ్మ.

